సమస్యలుంటే సాక్షికి చెప్పండి
మీ సమస్యలు, ప్రజోపయోగ సూచనలు, ఇతర అంశాలను మా ప్రతినిధి ఫోన్ నంబర్‌కు వాట్సాప్ చేయండి
91829 05602
నంబర్‌లో సంప్రదించండి



టోల్‌బాధ తొలిగేదెలా..?

- మాధవస్వామి ఆలయ సమీపంలో ఏర్పాటు
- రోజులో మూడు, నాలుగు సార్లు స్థానికులు, మాలధారుల రాకపోకలు
- అన్నిసార్లూ డబ్బులు చెల్లించలేక ఇబ్బందులు
- మినహాయింపు ఇవ్వాలని వేడుకోలు



టోల్‌గేటుకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తున్న భక్తులు, మాలధారులు, కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణ

మద్రిపాలెం : మాధవధారలో గల టోల్‌గేట్ వద్ద నిర్వాహకుల తీరుతో పరిసర ప్రాంతాల్లోని భక్తులు, మాలధారులు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారు. మాధవధార కొండకు నిత్యం వందల సంఖ్యలో భక్తులు వస్తుంటారు. కార్తీక మాసం కావడంతో అయ్యప్ప మాలధారులు, పరిసర ప్రాంతాల్లోని భక్తులు ఎక్కువ సంఖ్యలో వస్తుంటారు. అయితే ఈ ప్రాంతంలో ఏర్పాటు చేసిన టోల్‌గేట్ వీరికి ఇబ్బందికరంగా మారింది. సింహాచలం దేవస్థానం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన టోల్‌గేటు నిర్వహిస్తున్న వారు బలవంతంగా టోల్‌ఫీజు వసూలు చేస్తున్నారని భక్తులు, మాలధారుల ఆందోళన చెందుతున్నారు. బైక్‌కు రూ.10, కారుకు రూ.20 చొప్పున ఇక్కడ వసూలు చేస్తున్నారు. కనీసం మాలధారులు, స్థానిక భక్తులకైనా టోల్‌ఫీజు నుంచి మినహాయింపు ఇవ్వాలని కోరుతున్నారు.

రోజూ నాలుగైదు సార్లు డబ్బులివ్వలేక...

మాధవధారతోపాటు పరిసర ప్రాంతాల్లోని అయ్యప్ప మాలధారులు రోజుకి మూడు నుంచి నాలుగు సార్లు స్నానాల నిమిత్తం ఇక్కడకు వస్తుంటారు. ఒక్కోసారి ఎక్కడైనా మృతదేహం ఎదురైతే ఇంటికి వెళ్లకుండా మాలధారులు మాధవధార కొండపై గల జలధార వద్ద స్నానాల కోసం వస్తారు. ఈ రకంగా అయ్యప్ప, భవానీ మాలధారులు నిత్యం ఇక్కడకు వస్తుంటారు. అలా వచ్చే భక్తులు రూ.40 నుంచి రూ.50 వంతున టోల్‌ఫీజు కట్టడం తలకుమించిన భారంగా పరిణమిస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కార్తీకమాసం, మాఘమాసంలో అయినా టోల్‌ఫీజు వసూలు నిలిపివేయాలని డిమాండ్ చేస్తున్నారు. జలధార వద్ద భక్తులకు కనీస సదుపాయాలు కల్పించాలని కోరుతున్నారు. ఈ సమస్య పరిష్కరించి మాలధారులకు, స్థానిక భక్తులకు మినహాయింపు ఇవ్వాలని కోరుతూ వార్డు కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణ ఇటీవల సింహాచలం దేవస్థానం అధికారులకు వినతిపత్రం కూడా అందించారు. కొద్ది రోజుల కిందట భక్తులు, స్వచ్ఛంద సంఘాల సభ్యులు టోల్‌గేట్ నిర్వాహకుల వ్యవహారశైలికి వ్యతిరేకంగా చేపట్టిన ఆందోళనకు వెంకటరమణ మద్దతు తెలిపారు.

దురుసుగా ప్రవర్తిస్తూ డబ్బుల వసూలు

టోల్‌ఫీజు వసూలు చేసే నిర్వాహకులు రోడ్డుకి అడ్డంగా వాహనాలు ఆపి మరీ బైక్‌ల తాళాలు లాక్కుంటున్నారని భక్తులు మండిపడుతున్నారు. ఒక్కోసారి వాహనాల బ్రేకులు పని చేయక పలువురు పడిపోయిన సంఘటనలు కూడా ఉన్నాయని గుర్తు చేసుకుంటున్నారు. ఇంత బలవంతంగా టోల్ ఫీజు వసూలు చేస్తున్నా సరైన పార్కింగ్ సదుపాయం కూడా లేదని భక్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పార్కింగ్ కోసం ఎవరైనా నిర్వాహకులను అడిగితే తమకు సంబంధం లేదు... సింహాచలం దేవస్థానం అధికారులను అడగండి అని దురుసుగా బదులివ్వడంతో ఏం చేయాలో తెలియక భక్తులు డబ్బులు చెల్లించి వెళ్లిపోతున్నారు. టోల్‌ఫీజు వసూలు విషయంలో ఇటీవల పలుమార్లు నిర్వాహకులకు, భక్తులకు మధ్య వాగ్వాదం కూడా జరిగింది. గత ఆదివారం భక్తులు, మాలధారులు నిర్వాహకుల తీరుకి నిరసనగా పెద్ద ఎత్తున నినాదాలు చేయడంతో కొంతసేపు ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. భక్తులపై ఎదురుదాడికి దిగుతున్న నిర్వాహకులపై కఠిన చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.



టోల్ వసూలు చేస్తున్న సిబ్బంది

మాలధారులపై ఆర్థిక భారం



మాధవస్వామి ఆలయానికి వెళ్లే దారిలో టోల్ గేట్ నిర్వహించడం వల్ల స్థానిక భక్తులు, మాలధారులు ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారు. పరిసర ప్రాంతాల్లోని నివాసుల నుంచి టోల్‌ఫీజు వసూలు చేయొద్దని, తమకు మినహాయింపు ఇవ్వాలని ఎంత మంది అడిగినా సిబ్బంది దురుసుగా ప్రవరిస్తున్నారు. రూ.10 కట్టడానికి పెద్ద ఇబ్బంది కాకపోయినా రోజులో ఎక్కువ సార్లు అటుగా వెళ్తూ అన్నిసార్లూ డబ్బులు కట్టాల్సి రావడం మాలధారులకు ఆర్థికంగా భారంగా మారింది. మునుపెన్నడూ ఇలా ఇబ్బందులు లేవు. అధికారులు స్పందించి స్థానికులకు మినహాయింపునివ్వాలి.

– మణికంఠ, మాధవధార, 51వ వార్డు

స్థానికులను మినహాయించాలి



టోల్‌ఫీజు వసూలు విషయంలో మాధవధార పరిసర ప్రాంతాల్లోని నివాసులకు, మాలధారులకు మినహాయింపు ఇవ్వాలి. స్వామి మాలధారణ చేసిన వారిని, ఈ ప్రాంతంలోనే పుట్టి పెరిగిన మాలాంటి వారిని టోల్ ఫీజు కట్టమనడం సరైన పద్ధతి కాదు. డబ్బులు కట్టము అంటే సిబ్బంది బలవంతంగా వాహనాల తాళాలు లాక్కుని దురుసుగా ఆపేస్తున్నారు. ఇంతలా టోల్‌ఫీజు వసూలు చేస్తున్నా సరైన పార్కింగ్ సదుపాయం కూడా కల్పించలేదు. అడిగితే సంబంధం లేదంటున్నారు. సింహాచలం దేవస్థానం అధికారులు స్పందించి మాలధారులు, స్థానిక భక్తులకు మినహాయింపు ఇచ్చేలా చర్యలు చేపట్టాలి.

– తమ్మినేని రాంకీ, మాధవధార, 51వ వార్డు

సంకల్పబలంతో కాలినడకన తిరుమలకు..



సీతమ్మధార నుంచి కాలినడకన బయలుదేరిన గోవింద మాలధారులు

సీతమ్మధార : సంకల్ప బలంతో ఏదైనా సాధించవచ్చని విశాఖ నాగరానికి చెందిన వృద్ధ మిత్రులు నిరూపిస్తున్నారు. ఆరు పదుల వయస్సు దాటినా సరే ఉత్సాహం, దైవ భక్తితో గోవింద మాల ధరించి సీతమ్మధార నుంచి మంగళవారం ఉదయం తిరుమల వేంకటేశ్వరుని సన్నిధికి కాలినడకన బయలుదేరారు. 21 రోజులపాటు సాగే ఈ యాత్ర యువతలో స్ఫూర్తి నింపుతుందని 15 సార్లు కాలినడకన తిరుమల యాత్ర చేసిన డి.వెంకటరావు (67) పేర్కొన్నారు. దారిపొడవునా వేంకటేశ్వరుని గీతాలు ఆలపిస్తూ ప్రజల్లో భక్తిభావం పెంపొందిస్తామని తెలిపారు. తనతోపాటు 15 సార్లు యాత్ర చేసిన ఎస్.సన్యాసి రావు (82), ఏడు సార్లు యాత్ర చేసిన డి.ఎస్.ఎన్.మూర్తి (65), తొలిసారి రామ్మూర్తి రాజు (74) వస్తున్నారని తెలిపారు. తిరుగు ప్రయాణంలో రైలు మార్గంలో విశాఖ వస్తామని తెలిపారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన



శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు, కార్పొరేటర్ ముక్కా శ్రావణి, తదితరులు

సీతంపేట : జీవీఎంసీ 26వ వార్డులో రూ.50.35 లక్షలతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్ రాజు, కార్పొరేటర్ ముక్కా శ్రావణి మంగళవారం శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో పి.ఉషాకిరణ్, ముక్కా కిషోర్, నానాజీ, బి.శ్రీధర్, రవికుమార్, ఏఈ నిహారిక పాల్గొన్నారు.

క్లుప్తంగా

బెస్ట్ ఎన్‌సీసీ ఆఫీసర్‌గా చైతన్య



చైతన్యను అభినందిస్తున్న కళాశాల సెక్రటరీ కరస్పాండెంట్ మధుకుమార్

సీతంపేట : బుల్లయ్య కళాశాలకు చెందిన ఉప లెఫ్టినెంట్ టి.ఎస్.చైతన్య ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ఎన్‌సీసీ డైరెక్టరేట్‌లోని నావల్ వింగ్ సీనియర్ విభాగానికి బెస్ట్ అసోసియేట్ ఎన్‌సీసీ ఆఫీసర్‌గా గుర్తింపు పొందారు. ఈ నెల 24న హైదరాబాద్‌లో నిర్వహించిన 76వ ఎన్‌సీసీ రైజింగ్ డే వేడుకలు సందర్భంగా డిప్యూటీ డైరెక్టర్ జనరల్ చేతుల మీదుగా చైతన్య ఈ గౌరవాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా కళాశాల సెక్రటరీ కరస్పాండెంట్ జి.మధుకుమార్ అభినందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జి.ఎస్.కె.చక్రవర్తి, వైస్ ప్రిన్సిపాల్ సురేఖ, ఆర్.వి.హెచ్.శ్రీకాంత్, మేజర్ బ్రహ్మానందరెడ్డి, ఎన్‌సీసీ అధికారులు పాల్గొన్నారు.

డిప్యూటీ డీఈవో ఆకస్మిక తనిఖీ



విద్యార్థులతో మాట్లాడుతున్న జిల్లా ఉప విద్యాశాఖాధికారి సోమేశ్వరరావు

సీతంపేట : జిల్లా ఉప విద్యాశాఖాధికారి సోమేశ్వరరావు అక్కయ్యపాలెంలోని ఎన్జీజీవోస్ కాలనీ జీవీఎంసీ హైస్కూల్‌ను మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పదో తరగతి విద్యార్థులతో ముచ్చటించారు. సిలబస్ పూర్తయ్యిందా..?, 100 డేస్ ప్లాన్ అమలు చేస్తున్నారా..?, వీక్లీ టెస్ట్‌లు నిర్వహిస్తున్నారా..? అని అడిగి తెలుసుకున్నారు. అలాగే పదో తరగతి విద్యార్థులకు హిందీ చదవడం, రాయడం వచ్చా అని కనుక్కొన్నారు. ప్రతీ విద్యార్థి టీచర్ చెప్పే పాఠాలు శ్రద్ధగా విని మంచి మార్కులు తెచ్చుకుని ఉజ్వల భవిష్యత్‌కు బాటలు వేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం లక్ష్మీ నరస, ఉపాధ్యాయులు ఆర్.శ్రీనివాసరావు, మాణిక్యం, రాధిక, ధర్మారావు, కిషోర్, తదితరులు పాల్గొన్నారు.

దుర్గామాత సన్నిధిలో అన్నదానం



భక్తులకు అన్నప్రసాదం వడ్డిస్తున్న బీజేపీ నాయకుడు మాధవ్, తదితరులు

సీతమ్మధార : జీవీఎంసీ 24వ వార్డు రేసపువానిపాలెం వద్ద గల శ్రీ శాంతి స్వరూపిణి దుర్గా అమ్మవారు ఆలయ ఆవరణలో కేఎస్ఎస్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మంగళవారం అయ్యప్పస్వామి భక్తులకు అన్నదానం చేశారు. ట్రస్టు అధ్యక్షుడు కర్రి మురళీకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్నదానాన్ని బీజేపీ నాయకుడు, మాజీ ఎమ్మెల్సీ పీవీఎన్ మాధవ్ ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ట్రస్టు ఆధ్వర్యంలో రోజూ మాలధారులకు అన్నదానం చేయడం అభినందనీయమన్నారు. అన్ని దానాల్లోనూ అన్నదానం ఎంతో మిన్న అని కొనియాడారు. అంతకు ముందు ఆయన దుర్గా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వల్లూరి బ్రహ్మనాయుడు, బేతా సురేష్, వేణుగోపాలరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సంస్కృతాన్ని ప్రోత్సహించాలి



కరపత్రం అందజేస్తున్న సంస్కృత భారతి ప్రతినిధులు

సీతమ్మధార : సంస్కృత భాష అధ్యయనంతోపాటు వ్యాప్తిని ప్రోత్సహించాలని సంస్కృత భారతి ప్రతినిధులు కోరారు. ఈ మేరకు బీజేపీ నాయకురాలు శ్యామలదీపికను మంగళవారం కరపత్రాలు అందించారు. సంస్కృత భారతి కార్యక్రమాలను ఆమెకు వివరించారు.

29న జాబ్‌మేళా

కంచరపాలెం: స్థానిక జిల్లా ఉపాధి కార్యాలయం నేషనల్ కెరీర్ సర్వీస్ సెంటర్‌లో ఈనెల 29న జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు జిల్లా సబ్ రీజినల్ ఎంప్లాయిమెంట్ అధికారి నిట్టాల శ్యామ్ సుందర్ తెలిపారు. కుశలవ ఇంటర్నేషనల్, ఎస్ఆర్ అకాడమిక్ అర్గనైజేషన్ లిమిటెడ్ సంస్థల్లో ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు ఉంటాయన్నారు. మిషన్ ఆపరేటర్స్, షిఫ్ట్ సూపర్‌వైజర్స్, సేల్స్ అండ్ సర్వీస్ ఇంజినీర్స్ ఉద్యోగాలకు టెన్త్, ఇంటర్మీడియట్, ఏదైనా డిగ్రీ ఉత్తీర్ణత సాధించిన 18–35 సంవత్సరాల వయసు గల వారు అర్హులన్నారు.

కార్మికుల సంక్షేమం కోసం కృషి



మాట్లాడుతున్న పీకే పట్నాయక్, నాయకులు

తాటిచెట్లపాలెం : రైల్వే ఉద్యోగులు, కార్మికుల సంక్షేమం కోసం ఈస్ట్ కోస్ట్ రైల్వే శ్రామిక్ యూనియన్ అహర్నిశలు కృషి చేస్తోందని యూనియన్ ప్రధాన కార్యదర్శి, ఆలిండియా రైల్వే మెన్స్ ఫెడరేషన్ జాతీయ ఉపాధ్యక్షుడు పీకే పట్నాయక్ తెలిపారు. డిసెంబర్ 4, 5, 6న నిర్వహించే రైల్వే గుర్తింపు యూనియన్ ఎన్నికల్లో ప్రచారం కోసం విశాఖపట్నం విచ్చేసిన పీకే పట్నాయక్ మంగళవారం దొండపర్తిలో గల యూనియన్ కార్యాలయంలో మాట్లాడారు. జాతీయ స్థాయిలో ఆలిండియా రైల్వే మెన్స్ ఫెడరేషన్, జోనల్ స్థాయిలో ఈస్ట్ కోస్ట్ రైల్వే శ్రామిక్ యూనియన్ కార్మికుల కోసం చేసిన పోరాటాలను గుర్తు చేశారు. ఎన్నికల్లో శ్రామిక్ యూనియన్‌ను గెలిపించాలని కోరారు. యూనియన్ డివిజనల్ కో ఆర్డినేటర్ పి.రామమోహన్‌రావు మాట్లాడుతూ యాజమాన్యంతో రాజీ లేని పోరాటం చేశామన్నారు. ఈ నెల 29న మద్రిపాలెంలో నిర్వహించే శ్రామిక గర్జన సభకు భారీగా హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఇందుకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. సమావేశంలో జోనల్ అధ్యక్షుడు పీవీజే రాజు, జోనల్ కార్యదర్శి బి.దామోదరరావు, తదితరులు పాల్గొన్నారు.

హోంగార్డు కృష్ణకు సన్మానం



హోంగార్డు కృష్ణను సన్మానిస్తున్న సీఐ శ్రీనివాసరావు, పోలీసులు

సీతమ్మధార : ద్వారకా పోలీస్ స్టేషన్‌లో హోంగార్డుగా పనిచేసి ఉద్యోగ విరమణ చేసిన సీహెచ్.కృష్ణను సీఐ వి.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సీఐ శ్రీనివాసరావు మాట్లాడుతూ హోంగార్డులు కూడా పోలీసులతో సమానంగా విశిష్ట సేవలు అందిస్తున్నారని కొనియాడారు. ముఖ్యంగా ట్రాఫిక్ విభాగంలో హోంగార్డులు ప్రశంసనీయంగా పని చేస్తున్నారని అభినందించారు. ద్వారకా స్టేషన్‌లో పనిచేసిన కృష్ణ సేవలు మరువలేనివని కొనియాడారు. కార్యక్రమంలో ఎస్‌ఐలు ధర్మేంద్ర, శ్రీను, ఏఎస్‌ఐ డీవీ రత్నం, రైటర్ శ్రీనివాసు, సిబ్బంది మౌనిక, సుజాత, ధనలక్ష్మి, జయలక్ష్మి, సువర్ణ, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా సత్యనారాయణ స్వామి వ్రతం



సత్యనారాయణ స్వామి వ్రతం చేస్తున్న భక్తులు



స్వామి వ్రతం నిర్వహిస్తున్న అర్చకులు

సీతమ్మధార : జీవీఎంసీ 14వ వార్డు శివారు గణేషనగర్‌లో గల త్రిముఖ విఘ్నేశ్వర పంచాయతన దేవాలయంలో ప్రధాన అర్చకులు ఏడిద గురునాథశర్మ ఆధ్వర్యంలో మంగళవారం ఉదయం సత్యనారాయణ స్వామి వ్రతం అత్యంత వైభవంగా నిర్వహించారు. ముందుగా సత్యనారాయణ స్వామికి పంచామృత అభిషేకం చేయించారు. వినాయకుడు, లక్ష్మీదేవి, విష్ణువు, పార్వతీ పరమేశ్వరులు, నవగ్రహాలు, అష్టదిక్పాలకులకు పూజలు చేశారు. అనంతరం భక్తులకు ప్రసాదం పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆలయ అధ్యక్షుడు టి.ఎస్.ఎన్.మూర్తి, కమిటీ సభ్యులు ఎం.ఎస్.ప్రకాశరావు, ఎం.రంగారావు, టి.వెంకటరావు, పైల రమణ, బీకే నాయుడు, కారే శ్రీధర్, కర్రి సోమిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మురళీనగర్ : కప్పరాడ ఎన్జీజీవోస్ కాలనీలో వెలసిన వైభవ వేంకటేశ్వరస్వామి ఆలయంలో పవిత్రోత్సవాల్లో భాగంగా రెండో రోజు మంగళవారం సామూహిక సత్యనారాయణస్వామి వ్రతం అర్చకుడు శేషాచార్యులు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. మురళీనగర్‌తోపాటు నగరంలోని వివిధ ప్రాంతాల భక్తులు అత్యధిక సంఖ్యలో పాల్గొని వ్రతం చేశారు. మధ్యాహ్నం అన్నసమారాధన చేశారు. ఆలయ కార్యనిర్వహణాధికారి బండారు ప్రసాద్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

సీతంపేట: కార్తీకమాసం బహుళ ఏకాదశి సందర్భంగా అక్కయ్యపాలెం శ్రీలలితాపీఠంలో సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలు నిర్వహించారు. పలువురు దంపతులు పాల్గొని భక్తి శ్రద్ధలతో వ్రతం ఆచరించారు. పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

సెవెన్ హిల్స్ కార్మికులకు న్యాయం చేయండి

సీతమ్మధార : సెవెన్ హిల్స్ ఆస్పత్రి కార్మికులకు న్యాయం చేయాలని ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజును సీఐటీయూ నాయకులు కోరారు. ఈ మేరకు బాలయ్య శాస్త్రి లే అవుట్‌లో గల కార్యాలయంలో ఎమ్మెల్యేను మంగళవారం కలిసి వినతిపత్రం అందజేశారు. యాజమాన్యంతో కుమ్మక్కై కార్మికుల కడుపు కొట్టే విధంగా కార్మిక శాఖ ఇన్‌చార్జి జాయింట్ కమిషనర్ వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. దీంతో కార్మికశాఖ అధికారులు, సెవెన్ హిల్స్ యాజమాన్యంతో మాట్లాడుతానని ఎమ్మెల్యే భరోసా ఇచ్చారు. వై.రాజు, ఎం.సుబ్బారావు, నూకరాజు శ్రీను, అమ్మ లావణ్య తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగంతో అందరికీ సమన్యాయం



అంబేద్కర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న కేకే రాజు, కటుమూరి సతీష్, తదితరులు



అంబేద్కర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న రెయ్యి వెంకటరమణ, వైఎస్సార్ సీపీ నాయకులు



నివాళులర్పిస్తున్న వైఎస్ రాజు, శ్రీనివాసరావు



అంబేద్కర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యేలు విష్ణుకుమార్‌రాజు, పల్లా శ్రీనివాసరావు

కంచరపాలెం : భారత రాజ్యాంగం అందరికీ న్యాయం, సమానత్వం, స్వేచ్ఛ అందిస్తోందని వైఎస్సార్‌సీపీ విశాఖ ఉత్తర నియోజకవర్గ సమన్వయ కర్త కె.కె.రాజు అన్నారు. రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా తాటిచెట్లపాలెం జాతీయ రహదారి కూడలిలో డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ విగ్రహానికి జీవీఎంసీ డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్‌తో కలిసి ఆయన మంగళవారం నివాళులర్పించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఫ్లోర్ లీడర్ శంకరరావు, కె.శశికళ, సేనాపతి అప్పారావు, పేడాడ రమణకుమారి, పైడి రమణ, దుప్పలపూడి శ్రీనివాస్, సిద్ధార్థ, మహేష్, శ్రీను, నూకరాజు, ప్రసాద్, రవికుమార్, నాగమణి, సుశీల, సుకుమార్ పాల్గొన్నారు.

మద్రిపాలెం: రాజ్యాంగ రూపకర్త డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌కు 51వ వార్డు కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణ మంగళవారం ఘనంగా నివాళులర్పించారు. రాజ్యాంగ ఆమోద దినోత్సవం సందర్భంగా వార్డు కార్యాలయంలో వైఎస్సార్ సీపీ నాయకులతో కలిసి అంబేద్కర్ చిత్రపటానికి మంగళవారం పూలమాలలు వేశారు. పైడి శ్రీను, కరిమిరెడ్డి శ్యామ్, ధర్మవతి, పైడిరాజు, వినోద్, చంటి తదితరులు పాల్గొన్నారు.

మురళీనగర్ : భారత రాజ్యాంగం భారతీయులకు ప్రాణంతో సమానమని పాలిటెక్నిక్ కాలేజీ ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ కేడీవీ నరసింహారావు అన్నారు. కంచరపాలెం ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీలో రాజ్యాంగ దినోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో రాజ్యాంగ పరిరక్షణ ప్రతిజ్ఞ చేయించారు. 49వ వార్డు అల్లూరి సీతారామరాజునగర్‌లోని కేకే కాలనీ జీవీఎంసీ ఉన్నత పాఠశాలలో రాజ్యాంగ దినోత్సవాన్ని ప్రధానోపాధ్యాయురాలు ఎస్ఎస్ఎం సాయిలక్ష్మి ఆధ్వర్యంలో సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయుడు కృష్ణారావు పర్యవేక్షణలో నిర్వహించారు. ఉపాధ్యాయుడు ఎంవీవీ త్రినాథరావు, శ్రీధర్, ప్రశాంతి, రాజబాబు, పద్మ, నరసింగరావు పాల్గొన్నారు.

కంచరపాలెం : భారత రాజ్యాంగం పవిత్ర గ్రంథమని వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ నాయకుడు వై.ఎస్.రాజు కొనియాడారు. జీవీఎంసీ 55వ వార్డు కంచరపాలెం పరిధి ధర్మానగర్‌లో క్రాంతి యువజన ప్రగతి మండలి నాయకులు ఎడ్ల సిద్ధార్థ, వై.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో మంగళవారం రాజ్యాంగ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ముందుగా అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సొండి సురేష్ కుమార్, గంగ మహేష్, ధనాల అప్పారావు, ఎస్.శంకర్, రాజేంద్ర, నారాయణ, రవి, పండు, నీలాపు సూర్య పాల్గొన్నారు.

సీతంపేట : స్థానిక రాజేంద్రనగర్‌లో గల జనసేన నగర కార్యాలయంలో రాజ్యాంగ దినోత్సవం, జాతీయ లా డే మంగళవారం ఘనంగా నిర్వహించారు. పార్టీ నాయకులు అంబేద్కర్ చిత్రపటానికి నివాళులర్పించారు. అంబేద్కర్ రాజ్యాంగం ద్వారా కల్పించిన హక్కులను, దేశానికి చేసిన సేవలు ఒకసారి గుర్తు చేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్ కందుల నాగరాజు, సౌత్ ఇన్‌చార్జి శివప్రసాద్, మహిళా కో ఆర్డినేటర్ అమరాపు దుర్గ, ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ కొల్లూరు రూప, నారా నాగేశ్వరరావు, కోసూరు శ్రీనివాస్, మద్రివేముల శ్రీనివాస్ పాల్గొన్నారు.

సీతమ్మధార : భారత రాజ్యాంగ ఆమోద దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం బాలయ్య శాస్త్రి లే అవుట్‌లోని కార్యాలయంలో ఎమ్మెల్యేలు పెనుమత్స విష్ణుకుమార్‌రాజు, పల్లా శ్రీనివాసరావు, నాయకులు అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భారత రాజ్యాంగం వల్ల స్వేచ్ఛ, సమానత్వం, న్యాయం వంటి ఫలాలు దేశ ప్రజలకు అందుతున్నాయన్నారు. బీజేపీ నేత శ్యామలాదీపిక, తదితరులు పాల్గొన్నారు

తాటిచెట్లపాలెం : ఈస్ట్‌కోస్ట్ రైల్వే, వాల్తేర్ డివిజన్ పరిధిలో భారత రాజ్యాంగ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దొండపర్తిలో గల డివిజినల్ రైల్వే మేనేజర్ కార్యాలయంలో డీఆర్‌ఎం మనోజ్‌కుమార్‌సాహూ, అధికారులు, సిబ్బంది రాజ్యాంగ ప్రవేశికను చదివారు.

సీతమ్మధార : గురుద్వారా వద్ద గల ఆంధ్రప్రదేశ్ తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (ఈపీడీసీఎల్) కార్పొరేట్ కార్యాలయంలో సీఎండీ పృథ్వీతేజ్, సిబ్బంది రాజ్యాంగ ప్రతిజ్ఞ చేశారు. సంస్థ డైరెక్టర్లు వి.విజయలలిత, బి.రామచంద్రప్రసాద్, ఎన్.వి.రమణమూర్తి, సీజీఎంలు డి.సుమన్ కళ్యాణి, జె.శ్రీనివాసరావు, అచ్చి రవికుమార్, టి.వి.ఎస్.ఎన్.మూర్తి, బి.అశోక్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.



అంబేద్కర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు



అధికారులు, సిబ్బందితో రాజ్యాంగ పీఠికను చదివిస్తున్న డీఆర్‌ఎం మనోజ్‌కుమార్ సాహూ



ఉద్యోగులతో రాజ్యాంగ ప్రతిజ్ఞ చేయిస్తున్న ఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ్

వైభవంగా మహాలింగ రుద్రాభిషేకం



రుద్రాభిషేక పూజలో ముత్తంశెట్టి శ్రీనివాసరావు

సీతమ్మధార : మాజీ మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాసరావు సీతమ్మధారలోని స్వగృహంలో మంగళవారం మహాలింగ రుద్రాభిషేక పూజలు వైభవంగా నిర్వహించారు. వేద పండితుల మంత్రోచ్ఛారణతో భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రోడ్డెక్కిన మురుగుతో అవస్థలు



సీతంపేటలో రాధాకృష్ణ ఆలయం వద్ద రోడ్డుపై నిలిచిపోయిన మురుగు నీరు

సీతంపేట : ఉన్నతాధికారుల పర్యవేక్షణ లోపంతో వార్డుల్లో పారిశుధ్య నిర్వహణ అధ్వానంగా మారింది. పదుల సంఖ్యలో సిబ్బంది ఉన్నా ప్రధాన రహదారుల్లో తరచూ మురుగు నీరు రోడ్డెక్కుతున్నా శాశ్వత పరిష్కారం చూపడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జీవీఎంసీ 25వ వార్డు దుర్గా గణపతి ఆలయం నుంచి రాధాకృష్ణ ఆలయానికి వెళ్లే మార్గంలో బైక్ రెంటల్స్ వద్ద మురుగు నీరు రోడ్డెక్కి ప్రవహిస్తోంది. ఇక్కడ తరచూ ఇదే సమస్య తలెత్తుతోందని, దుకాణాల ముందు మురుగు నీరు నిలిచిపోవడంతో వ్యాపారాలు జరగడం లేదంటున్నారు. మురుగు నీరు రోడ్డెక్కినప్పుడల్లా సిబ్బంది వచ్చి చెత్త తీసి వెళ్లిపోతున్నారు. మరలా అదే సమస్య ఎదురవుతోందని నివాసితులు అంటున్నారు. డ్రెయిన్‌లో చెత్త, వ్యర్థాలు తొలగించే వీలు లేకుండా ఇళ్ల ముందు స్లాబులు వేయడం వల్ల సమస్య తలెత్తుతోందని పలువురు ఆరోపిస్తున్నారు. మురుగు నీరు సాఫీగా ప్రవహించేలా, రోడ్డుపైకి నీరు రాకుండా సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని స్థానికులు కోరుతున్నారు, సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.